క్లుప్తంగా

మద్దిలో అభిషేక సేవ


స్వామికి అభిషేక సేవ చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారికి శనివారం అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖ మండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చకులు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం చేశారు. ఏలూరు జిల్లా సూర్యచంద్రరావుపేట రామ భక్త హనుమాన్ సాయి భజన మండలి వారు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,09,159 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

సామూహిక వ్రతాలు


వ్రతం ఆచరిస్తున్న మహిళలు

కొయ్యలగూడెం: శ్రావణమాసం సందర్భంగా గవరవరం శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో మహిళలు సామూహిక వ్రతాలు ఆచరించారు. అర్చకులు స్వామివారి మూలవిరాట్ విగ్రహాలకు విశేష పూజలు చేసి, సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో పూజలు చేసిన మహిళలు వాయినాలు సమర్పించుకున్నారు. సామూహిక దీపపు కుందెలను వెలిగించి హారతులిచ్చారు. ప్రసాద వితరణ కార్యక్రమం పాలకవర్గ సభ్యులు నిర్వహించగా గ్రామోత్సవం చేశారు. కాగా కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీ లలితా సహస్రనామ కోటి పారాయణ 50 లక్షలకు పూర్తయింది.

అధిష్టానానికి కృతజ్ఞతలు


బ్రహ్మన్న

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా నియమితులైన రాజవరం మాజీ ఎంపీటీసీ తమ్మిర్సి బ్రహ్మన్న శనివారం పార్టీ అధిష్టానానికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణు

జంగారెడ్డిగూడెం: తమ ఆసుపత్రి ద్వారా అందించే వైద్య సేవలను జంగారెడ్డిగూడెం పట్టణంతో పాటు ఏజెన్సీ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వేణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ వేణు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 15న వేణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మండలంలోని వేగవరం వద్ద విజయ కృష్ణా రెసిడెన్సీ లోటస్ లేఅవుట్‌లతో ప్రారంభించామన్నారు. గుండె వ్యాధుల చికిత్సకు అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశామని, అన్ని రకాల హృద్రోగ సమస్యలపై చికిత్స అందిస్తామని తెలిపారు. ఆసుపత్రి ప్రారంభించి తరువాత తొలిసారిగా శస్త్రచికిత్స నిర్వహించామన్నారు. రాంబాబు (48) అనే వ్యక్తికి స్టెంట్ వేయగా, ప్రస్తుతం ఆయన కోలుకున్నారని, ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. తక్కువ ఖర్చుతోనే స్టంట్ వేశామన్నారు. రాంబాబును శనివారం డిశ్చార్జి చేసినట్టు తెలిపారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి


చిప్పాడ వెంకన్న

జంగారెడ్డిగూడెం: పింఛన్‌ల విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్చుకోవాలని వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం మీడియా కో ఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పెన్షన్‌లు అమలులో జాప్యం తగదని పేర్కొన్నారు. 60 ఏళ్లు పైబడి పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే వారి స్థానంలో భార్యకు పెన్షన్ ఇచ్చే కొత్త ప్రక్రియ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. నూతన పెన్షన్‌లు మాత్రం ఇవ్వడం లేదని, కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ల హామీని విస్మరించిందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి ఆరు నెలలకు ఒక సారి కొత్త పింఛన్లు అమలు చేసే వారని గుర్తుచేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, వికలాంగ నూతన పింఛన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏజెన్సీలో పశువైద్యం గగనం

- భర్తీ కాని పశువైద్యుల పోస్టులు
- 8 పశు వైద్యశాలలకు ఒక్కరే ఇన్‌చార్జి
- సిబ్బందితోనే సేవలు
- గిరిజన ప్రాంత రైతులకు అవస్థలు
- పట్టించుకోని పాలకులు


బుట్టాయగూడెం పశువైద్యశాల


బుట్టాయగూడెం పశువైద్యాధికారి లేక ఖాళీగా ఉన్న కుర్చీ

బుట్టాయగూడెం: పశువైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. గిరిజన మండలాల్లో ఎంతో కాలంగా పశు వైద్యశాలలకు వైద్యులు లేకుండానే కాలక్షేపం చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలం బుట్టాయగూడెం, నూతిరామన్నపాలెం, దొరమామిడి, పోలవరం మండలం రేపల్లెవాడ, గూటాల, జీలుగమిల్లి మండలం దర్భగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉన్న పశు వైద్యశాలల్లో పశువైద్యుల పోస్టులు భర్తీ కాకపోవడంతో గిరిజన ప్రాంత పాడి రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ వైద్యశాలలకు కొయ్యలగూడెంకు చెందిన పశువైద్యాధికారిని ఇన్‌చార్జిగా నియమించడంతో పశువులకు సరైన వైద్యం అందడంలేదని రైతులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం పశువులకు వచ్చే వ్యాధులపై సరైన వైద్యం అందిక పోతే మూగజీవాల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

1,61,730 మూగజీవాలు

పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు గిరిజన మండలాల పరిధిలో సుమారు 1,61,730 వరకు మూగజీవాలు ఉన్నట్టు పశువైద్యాధికారులు చెబుతున్నారు. వీటిలో ఆవులు 53586, గేదెలు 38336, గొర్రెలు 24774, మేకలు 45034 ఉన్నాయి. పశు వైద్యశాలల్లో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో సిబ్బందితోనే అరకొర వైద్యసేవలు పొందాల్సివస్తుందని పాడి రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశు వైద్యులు లేరు!

బుట్టాయగూడెం మండల కేంద్రమైన బుట్టాయగూడెం, ఎస్‌ఆర్‌పాలెం, జీలుగుమిల్లి మండం దర్భగూడెం, పోలవరం మండలం గూటాల, రేపల్లెవాడ, కుక్కునూరు, వేలేరుపాడు గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం, పులిరామన్నగూడెం, జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం, పూచికపాడు, ములగలంపల్లి, వేలేరుపాడు మండలం రుద్రమకోట గ్రామాల్లో గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. వీటి పరివేక్షణకు పోలవరం, జీలుగుమిల్లి మండల కేంద్రాల్లో ప్రాంతీయ పశువైద్యశాలలు ఉన్నాయి. అయితే ప్రాంతీయ, గ్రామీణ పశువైద్య సహాయకులు ఉన్నప్పటికీ కీలకమైన పశువైద్యుల పోస్టులు ఎంతో కాలంగా భర్తీకి నోచుకోలేదు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం పశువైద్యాధికారిణి మెడికల్ లీవ్‌లో ఉన్నారు. బుట్టాయగూడెం పశు వైద్యాధికారి ఇటీవల ఇతర ప్రాంతానికి బదిలీ అయ్యారు. దీంతో గిరిజన మండలాల్లో కీలకమైన పశువైద్యుల పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఆయా పశు ఆసుపత్రులకు వైద్యులు లేని పరిస్థితి నెలకొంది. అయితే గిరిజన మండలాల్లో ఉన్న ఎనిమిది పశు వైద్యశాలలకు కొయ్యలగూడెంకు చెందిన పశు వైద్యులు శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జిగా నియమించారు.

వైద్యం అందేలా కృషి



పశు వైద్యుల నియమకాల్లో గిరిజన ప్రాంతానికే ప్రాధాన్యత ఇస్తాం. తప్పనిసరిగా గిరిజన మండలాల్లో ఉన్న అన్ని పశువైద్యశాలల్లో పశువైద్యుల పోస్టుల భర్తీకి కృషి చేస్తున్నాం. పాడి రైతులకు ఇబ్బంది కలుకుండా పశువులకు సకాలంలో వైద్యసేవలు అందేలా కృషి చేస్తున్నాం.

– డాక్టర్ మల్లంపల్లి సాయి బుచ్చారావు, సహాయ సంచాలకులు, జీలుగుమిల్లి

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న జంగం వెంకటేశ్వరరావుపై అదే ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వెంకటేశ్వరరావు డాంగే నగర్‌లో ఉన్న తన ఇంటి నిర్మాణం నిమిత్తం ఈ నెల 1వ తేదీన వెళ్లగా, అక్కడే ఉన్న సీలం మంగరాజు, సీలం రాంబాబు, సీలం కృష్ణ, సీలం సురేష్‌లు దుర్భాషలాడుతూ దాడి చేశారన్నారు. వెంకటేశ్వరరావు కుమారుడు అడ్డుపడగా, వారు అక్కడ నుంచి వెళ్లిపోయారని తెలిపారు. వెంకటేశ్వరరావును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడని, వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: నిమ్మలగూడెంలో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై డి.శశాంక తెలిపారు. నిమ్మలగూడెంకు చెందిన నిమ్మల సత్యవతి అనారోగ్య కారణాలతో 15 రోజుల క్రితం గుర్వాయిగూడెంలోని తన కుమారుడు ఇంటికి వెళ్లింది. శనివారం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు సత్యవతికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె ఇంటికి వచ్చి లోపలికివెళ్లి చూడగా, బీరువాలో ఉంచిన 15 తులాల వెండి వస్తువులు, నగదును చోరీ అయినట్టు గుర్తించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

మోసం చేయడం బాబు నైజం


భూదేవిపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు


చాగరపల్లిలో రాంబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు

మాజీ ఎమ్మెల్యే బాలరాజు

వేలేరుపాడు: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆరోపించారు. శనివారం వేలేరుపాడు మండలం భూదేవిపేట, చాగరపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబానికి ఏ మేరకు నష్టం జరిగిందో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి చూపించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ఇచ్చిన నవరత్నాల పథకాలతోపాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తే, కూటమి ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి దోచుకోవడం, దాచుకోవడంలో పోటీ పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏటా రైతు భరోసా పేరుతో రైతుకు రూ.13500 అందిస్తే, కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా మార్చినప్పటికీ నేటికీ అమలు చేయడంలేదని వివరించారు. రైతులకు విత్తనాలు, యూరియా కూడా సక్రమంగా పంపిణీ చేయడంలేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే, డాక్టర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన బెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని దుయ్యబట్టారు. రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేయడం, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధించడం తప్ప, ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు. గ్రామాల్లో ప్రజలు హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని బాలరాజు పిలుపునిచ్చారు.

రాంబాబు కుటుంబానికి పరామర్శ

వేలేరుపాడు మండలం చాగరపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గిరిజన నాయకులు మొట్టు రాంబాబు కుమారుడు ఇటీవల ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని బాలరాజు పరామర్శించారు. భూదేవిపేట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గొట్టుపర్తి మల్లూరు కుటుంబాన్ని, అనారోగ్యంతో బాధపడుతున్న బద్దె కృష్ణను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ వాళ్ల లక్ష్మీదేవి, ఎంపీటీసీలు మేడవరపు నాగశ్రీ, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యులు ఎండీ షౌకత్ హుస్సేన్, పార్టీ మండల నాయకులు కామినేని వెంకటేశ్వరావు, గుద్దేటి భాస్కర్, మేడవరపు బుచ్చిబాబు, కౌలూరి సత్తిరాజు, కర్నాటి రాజా, జార్తి బిక్షం, కట్కూరు మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో మిగిలిన సీట్లను ఈనెల 5న ఉదయం 10.30 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ధ్రువీకరణ కోసం అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని, సీటు రిజర్వు అయితే ఏడాదికి రూ.4700 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 90102 22162 సంప్రదించాలని తెలిపారు.

గౌరవ వేతనాలు చెల్లించాలి

లింగపాలెం: ప్రభుత్వం వెంటనే ఎంపీటీసీల గౌరవ వేతనాలు చెల్లించాలని లింగపాలెం మండల వైస్ ఎంపీపీ మట్ట సురేష్ కోరారు. ఈ మేరకు మట్టా సురేష్ శనివారం ధర్మాజీగూడెంలో విలేకర్లతో మాట్లాడుతూ గతేడాది కాలంగా ఎంపీటీసీలకు గౌరవ వేతనం రావటం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంపీటీసీలకు గౌరవ వేతనాన్ని చెల్లించాలని సురేష్ కోరారు.

క్వాంటం కంప్యూటింగ్‌లో నైపుణ్యం సాధించాలి

జంగారెడ్డిగూడెం: కంప్యూటర్ సైన్స్ విభాగంలో క్వాంటం కంప్యూటింగ్ భావన అనే అంశంపై అతిథి ఉపన్యాసం ఛత్రపతి శివాజీ త్రి శతజాతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు కె.సత్యరాజేష్ మాట్లాడారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రస్తుతం విస్తృతమవుతుందన్నారు. ఫిజిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌లో విద్యార్థులు నైపుణ్యం సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి జె.రాజా శ్రీకాంత్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం మధు, గణిత విభాగ అధిపతి సీహెచ్ బదరీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతను గుర్తించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ పద్మావతి

చింతలపూడి: మండలంలోని వైఎస్సార్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పద్మావతి మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత గురించి తల్లులకు వివరించారు. తల్లిపాలు బిడ్డ హక్కుని బిడ్డకు అదే తొలిటీకా అని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.జోషి, మహిళా సంరక్షణ కార్యదర్శి అపర్ణ, ఏఎన్‌డీ దివ్య తదితరులు పాల్గొన్నారు.

చీమలవారిగూడెంలో..


బుట్టాయగూడెం: మండలంలోని చీమలవారిగూడెంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎవీవి సత్యవతి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఉంటాయని, తల్లిబిడ్డకు అనుబంధం పెరుగుతుందని చెప్పారు. తల్లిపాల వారోత్సవాలను ఆగష్టు 7వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

5న ధర్నాను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రవి


జంగారెడ్డిగూడెం: ఆదానీ స్మార్ట్ మీటర్లపై పెట్టే ఖర్చు ట్రూ అప్ చార్జీలు తగ్గిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రవి అన్నారు. ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సీపీఎం స్థానిక కార్యాలయంలో సీపీఐ పట్టణ కార్యదర్శి జంపన వెంకటరమణరాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో రవి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణలు మాట్లాడారు. ఈనెల 5న అశ్వరావుపేటరోడ్‌లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ఇప్పటికే రూ.3500 కోట్లు ప్రజలపై భారంవేశారని తెలిపారు. మళ్లీ వేల కోట్లు ఖర్చుపెట్టి ఆదాని మీటర్లు కొనాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆదాని స్మార్ట్ మీటర్లు ఉపసహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మానుకొండ జీవరత్నం, సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు, రైతు సంఘం నాయకులు శంకర్ రాధాకృష్ణ, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి మొల్లేటి శ్రీనివాస్, వంగ గోపి తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం వెళ్లిన భాగవతులు


అన్నవరానికి వెళ్లిన భాగవత సదనంకు చెందిన భాగవతులు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి పొందిన రంగాపురం శ్రీ భూనీళాసమేత సత్యనారాయణ స్వామి ఆలయ పరిధిలోని స్థానిక భక్తి ఆధ్యాత్మిక సేవాసంఘం భాగవత సదనం నుంచి సుమారు 100 మంది భాగవతులు అన్నవరం దేవస్థాన ఆహ్వానం మేరకు కైంకర్య నిమిత్తంగా వెళ్లారు. విష్ణు సహస్రనామ పఠనం, నామసంకీర్తనం, అభాంగం, కూచిపూడి నృత్యనివేదనాలు సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంతమంది భాగవతులు రావడం తమ దేవస్థానానికి చాలా గౌరవప్రదమని అన్నవరం ఆలయ కార్యనిర్వహణాధికారి అయిన శ్రీమాన్ వి.సుబ్బారావు సంతోషం వ్యక్తం చేశారని భాగవత సదన ఆచార్యులు శ్రీమాన్ తిరుక్కోవళ్లూరి శ్రీనివాస పెరుమాళ్ తెలిపారు.

ఉచిత అన్నప్రసాదం నాణ్యత, రుచిపై ఆరా


ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: భక్తులకు అందిస్తున్న లడ్డూ, పులిహోర, శర్కర పొంగలి, వడ ప్రసాదాల తయారీని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి శనివారం తనిఖీ చేశారు. అంబరుఖానాకు వెళ్లిన ఆయన ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ వాసా నగేష్, సీనియర్ అసిస్టెంట్ వాసులతో కలిసి ప్రసాదాల తయారీ, నాణ్యతను పరిశీలించారు. అనంతరం నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడారు. ప్రసాదం నాణ్యత, రుచిపై ఆరా తీశారు. భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఈఓ ఆలయ పరిసరాల్లోని పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం

చింతలపూడి : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చింతలపూడి నగర పంచాయతీ, మండల కమిటీలను నియమిస్తూ తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నగర పంచాయతీ ఉపాధ్యక్షులుగా ధారా పేర్రాజు, నిమ్మగడ్డ దుర్గారావు, ప్రధాన కార్యదర్శులుగా ఇస్లావత్ వెంకటేశ్వరరావు, బండారు గోపి, సొంటి కన్నబాబు, మొగల్ ఇక్బాల్, ఉలవపూడి శ్రీను, కార్యదర్శులుగా మద్దుకూరి వెంకటేశ్వరరావు, జగన్నాథం గంగయ్య, సంది పాము వెంకన్న, బజారు కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా నండూరి ధర్మరాజు, దార నాగరాజు, కామవరపు మల్లయ్య, దాసరి కిషోర్, కాటూరి నరేంద్ర, తిరువీధుల కుటుంబరావు, నక్క వెంకటేశ్వరరావు, మత్తే వెంకటేశ్వరరావు, కొత్తపల్లి మోహన్, కలపాల గాలీబ్, గంగబోయిన నాగరాజు, దేవరపల్లి రాము, వాడపల్లి చల్లారావు, మానేపల్లి రాము తదితరులు నియమితులయ్యారు.

పార్టీ చింతలపూడి మండల కమిటీ

ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి రాంబాబు, తాండ్ర గోపాల కృష్ణారావు, ప్రధాన కార్యదర్శులుగా శేషపల్లి శివరామకృష్ణ, గద్దే ప్రసాద్, జుజ్జూరి వెంకట సత్యనారాయణరెడ్డి, మేడి రాములు, రైసా వెంకటేశ్వరావు, కార్యదర్శులుగా పెంకి బాబూరావు, భూక్యా కృష్ణ, గుమ్మళ్ళ నరశింహారావు, చింతా చెన్నారావు, కార్యవర్గ సభ్యులుగా పుప్పాల సర్వేశ్వరావు, బచ్చల వెంకన్న బాబు, కొండారెడ్డి సురేష్, చిలకాబత్తుల వెంకటేశ్వరావు, బచ్చల సంజీవ రావు, పింగుల రాంబాబు, చిమటా జగన్నాథ రావు, నల్లమెల్లి సత్యన్నారాయణ, మిరియాల సుధాకర్, స్వర్ణాల రాము, ముత్తిన అప్పారావు, సొంగా వెంకటేశ్వరరావు, దేవరకొండ కనకయ్య, నాగా నాగు తదితరులను నియమించారు.

పార్టీ కుక్కునూరు మండల కమిటీ

కుక్కునూరు: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం పార్టీ కుక్కునూరు మండల కమిటీని ప్రకటించింది. మండల అధ్యక్షుడిగా తాండ్ర రాజేష్, ఉపాధ్యక్షులుగా రాయి సత్యనారాయణ, మాదిరాజు వెంకటేశ్వరావు, జనరల్ సెక్రటరీలుగా ఆవుల బాలకృష్ణారెడ్డి, కొమ్ము వీరబాబు, పగిళ్ల అల్లేష్, పరిసిక వెంకటేశ్వర్లు, సెక్రటరీలుగా వెల్లూరి చైతన్య ప్రసాద్, గుమ్మల రామకృష్ణ, సారంగి మహేష్, అద్దనపు రాము, ఎండీ నాగుల్‌మీరా, ఎక్సిక్యూటీవ్ మెంబర్లుగా సకపల్లి వెంకటేశ్వర్లు, మడివి రమేష్, రాయల నాగేశ్వరావు, పెద్దిపల్లి రామయ్య, నేతగాని శ్రీనివాసరావు, బోల్లి రమేష్, దాసరి విజయరాజు, సారంగి చిరంజీవి, కుండా శ్రీను, కవులూరి నాగరాజు, కాకర్ల వెంకన్నబాబు, మడివి రాజులు, పాయం శ్రీను, అనుగోజు భాస్కరాచారి, ములకలపల్లి వెంకన్న, తుర్సం శివ, సిద్దెల ఈశ్వరయ్య, అగ్నిపర్తి చంద్రం, నిమ్మల ప్రసాద్ నియమితులయ్యారు.

పార్టీ లింగపాలెం మండల కమిటీ

లింగపాలెం: వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. మండల ఉపాధ్యక్షులుగా నాత శ్రీనివాసరావు, పామర్తి సుబ్బారావు, జనరల్ సెక్రటరీలుగా రావి రాజశేఖర్, కుచ్చులపాటి అగస్టీన్, మేకల బాలాజీ, పోతుల ఆనంద్ పాటిల్, తోలం రవి కిషోర్, కార్యదర్శులుగా వేంపాటి సోమేశ్వరరావు, చల్ల గంగాదరరావు, సుధ గోవిందు, కాట్రు మహేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కంభం పూర్ణవిజయ్, కాట్రు అంకమయ్య, వనమాల సూర్యనారాయణ, ఉప్పు బాబు (పెద్దోడు), ఘంటా గోపాలకృష్ణ సత్యనారాయణ, బొర్ర కామేశ్వరరావు, ఖండవల్లి సుధాకర్, చల్లగుల్ల రవిబాబు, బాడుగ మునిస్వామి, గొల్ల సత్యనారాయణ, యలమంచి రాంబాబు, బంటు నాగరాజు, చెన్ను నాగరాజు, అంగిరేకుల భూషణం, బుల్ల వెంకటేశ్వరరావు (యేసు)లు నియమితులయ్యారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం బుట్టాయగూడెంలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, సీఐటీయూ నాయకురాలు మొడియం నాగమణిలు మాట్లాడుతూ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్‌లను వ్యతిరేకించిన టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చాక స్మార్ట్‌మీటర్‌లు ఏర్పాటు చేసేందుకు చకచకా పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాన్ని మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు, తెల్లం మునీశ్వరరావు, బన్నే వినోద్, కెచ్చెల పోతురెడ్డి, కరకాల నడిపిరాజు, కరకాల ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

కుక్కునూరు: స్మార్ట్ మీటర్ల రద్దు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ఆగష్టు 5న నిర్వహించే విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాను విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కుక్కునూరు ప్రజాసంఘాల కార్యాలయం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు కొన్నె లక్ష్మయ్య, యర్రంశెట్టి నాగేంద్రరావులు మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల విధానంతో ప్రభుత్వం ప్రజలను నిలువుదోపిడి చేస్తుందన్నారు. నాయకులు కురాకుల బాబురావు, యర్నం సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, షేక్ వలీ, పులదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
90102 23729
70754 60815
Office mail : tpgadvt@gmail.com